జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 24-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 654 పేజీలు: 4 వెల : రూ.7



## మహేంద్ర తనయలో..
# ఇసుక తోడేళ్లు!

**సోంపేట, ఏప్రిల్ 23(వార్త):** సోంపేట మండలం గుండా ప్రవహించే మహేంద్ర తనయ నదిలో ఇసుక దోపిడీ యదేచ్ఛగా సాగుతోంది. అధికార యంత్రాంగం అసలు పట్టించుకోకపోవడం లేదు. ఈ నదిలో ఇసుక వాడకంపై నిషేధం ఉన్నప్పటికీ దాని గుర్చి ఆలోచించే వ్యక్తులు కరువయ్యారు. ట్రాక్టర్లతో నిత్యము వివిధ గ్రామాల వద్ద ఇసుక దోపిడీ ఇష్టారాజ్యంగా సాగుతుంది.

దామోదరపురం, అనంతపురం, కొత్తపల్లి, పైడిగం, బాతు పురం, తదితర గ్రామాల వద్ద నదిలో ఇసుకను ట్రాక్టర్లతో తోడేస్తున్నారు. ముఖ్యంగా శాసనం సమీపంలో గల ఉద్దానం పథకం పక్కనే ఉన్న మహేంద్రతనైనది నుంచి ఇసుక తోడడం వలన మంచినీటి పథకానికి ముప్పు వాటిల్లుతుందని పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ ఖాతరు చేయడం లేదు. అలాగే పర్యావరణానికి తీవ్ర సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఈ నది నుంచి ఇసుకను తోడవద్దని ఐదేళ్ల క్రితమే మైనింగ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అవన్నీ బుట్ట దాఖలుగానే మిగిలిపోయాయి. అక్రమ రవాణా జరుగుతున్న విషయంలో క్షేత్రస్థాయి నుంచి మండల కేంద్రం వరకు అధికారులు ఉన్నప్పటికీ నిఘా మాత్రం లేకపోవడం ఇసుక దోపిడీదారులకు వరంగా మారింది. మైనింగ్ శాఖ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం, పోలీస్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వారి ముందునుంచే ఇసుక తరలిపోతోంది. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో ఇసుక అక్రమ రవాణాదారుల పాలిట వరంగా మారింది. నదిలో ఇసుకను అడ్డదిడ్డంగా తవ్వడం వల్ల ప్రవాహదిశ మారుతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ఓ కన్ను వేసి మహేంద్రతనయ నదిలో ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాల్సివుంది.

* నదిలో ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లతో తరలించేస్తున్న దోపిడీదారులు
* ఇక్కడ ఇసుక తరలింపును నిషేధించిన మైనింగ్ అధికారులు
* పట్టపగలే తరలిపోతున్న ఇసుక
* ఉద్దానం పథకానికి ముప్పు
* తరలింపుదారులకు అధికార పార్టీ అండ
* అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



### ఇసుక వాహనాలన్నింటికి
## బిల్లులు తప్పనిసరి

* భూ గర్భ గనుల శాఖ ఉప సంచాలకులు మోహనరావు

**శ్రీకాకుళం, ఏప్రిల్23 (వార్త):** ఇసుక వాహనాలన్నింటికి బిల్లులు ఇచ్చి పంపాలని భూ గర్భ గనులు శాఖ ఉప సంచాలకులు మోహనరావు తెలిపారు. గురువారం రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి ఆయన గార, బూరవల్లి, పర్లం, పురుషోత్తపురం, కలివరం, దూసి ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో నాణ్యమైన ఇసుకను అందుబాటులో ఉంచి వినియోగదారులకు సరఫరా చేయాలన్నారు. ఇసుక లోడింగ్ చార్జీలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఇవ్వాలని, వచ్చిన వాహనాలు అన్నిటికి బిల్లుల తీసి ఇచ్చి పంపాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.



### వంశధార బ్రిడ్జి వద్ద
## రోడ్డు ప్రమాదం

* రెండు కార్లను ఢీకొట్టిన లారీ
* ఇద్దరికి తీవ్ర గాయాలు



**నరసన్నపేట, ఏప్రిల్ 23 (వార్త):** నరసన్నపేట మండలం మడపాం వంశధార బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వెళ్తున్న రెండు కార్లను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ కారు డివైడర్‌పైకి ఎక్కింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న నరసన్నపేట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



* కొత్తూరులో 45 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు * వడగాలులతో జిల్లావాసుల ఉక్కిరిబిక్కిరి * నేడు 12 మండలాల్లో 'తీవ్ర' వడగాల్పులు * వేసవి సెలవుల్లో పాఠశాలలు తెరవొద్దు * నిబంధనలు అతిక్రమిస్తే పాఠశాలలపై కఠిన చర్యలు * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

# నిప్పుల కొలిమి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 23(వార్త):**

జిల్లాలో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరిందని, శుక్రవారం జిల్లాలోని 12 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం కొత్తూరు మండలంలో అత్యధికంగా 45.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించారు. జిల్లాలోని 10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 6 మండలాల్లో వడగాల్పులు వీచాయని పేర్కొన్నారు. శుక్రవారం ఆమదాలవలస, బూర్జ, హిరమండలం, జలుమూరు, కంచిలి, కొత్తూరు, లక్ష్మీనరసుపేట, మందస, నందిగం, పాతపట్నం, సారవకోట, సరుబుజ్జిలి మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయన్నారు. గంగువారి సిగడాం, మెలియాపుట్టి మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలని, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి సెలవుల దృష్ట్యా ఈనెల 24 నుండి జూన్ 11 వరకు ఏ ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలలు ఎటువంటి తరగతులు గానీ, శిక్షణ తరగతులు గానీ నిర్వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలను కాలువలు, చెరువులు, నదుల వద్దకు పంపవద్దన్నారు. ఈత రాని వారు లోతైన నీటి వనరుల్లోకి దిగకూడదని తెలిపారు. తేలికపాటి పల్చని దుస్తులు ధరించాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ వాడాలని, తగినంత నీరు, పానీయాలు తీసుకోవాలన్నారు. పిల్లలు ఎండలో ఆడకుండా చూడాలని, హీట్ స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సెలవుల్లో పిల్లలు నిర్మాణాత్మకమైన, విద్యా సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం


## కిడ్నీ మార్పిడి బాధితునికి పరామర్శ



**సోంపేట, ఏప్రిల్ 23(వార్త):** గత నెలలో పలాస కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మొట్టమొదటిసారిగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసుకున్న బాధితురాలు సోంపేటకు చెందిన చెరుకుపల్లి హేమాశ్రీ సోంపేట వచ్చిన సందర్భంగా ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసుతోపాటు పలువురు వైసీపీ నేతలు ఆమెను పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ దాసు ఆమెకు మరిన్ని సూచనలు సలహాలు వైద్య పరంగా అందించారు. లక్షలాది రూపాయల ఖర్చుతో జరగాల్సిన ఇటువంటి ఆపరేషన్ మాజీ సీఎం వైఎస్ జగన్ చొరవతో మన ప్రాంతంలో ఉచితంగా జరగడం గర్వకారణమని అన్నారు. పరామర్శలో ఎంపీటీసీ పొడుగు కామేష్, శిలగాన భాస్కరరావు, నగిరి శరత్ బాబు, రేగు బాలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పోషణ పక్వాడా వారోత్సవాలు



**మందస, ఏప్రిల్ 23(వార్త):** ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరుగుతున్న పోషన్ పక్వాడా వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. జిల్లుండ పంచాయతీలో గల ఉమాగిరి అంగన్ వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహార సక్రమంగా తీసుకోవాలన్నారు. 0 నుంచి 2 ఏళ్ల మధ్య పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలని, దీంతో మెదడు అభివృద్ధి సక్రమంగా ఉంటుందన్నారు. కేంద్రంలో ఉన్న ప్రీస్కూల్ పిల్లలు పాము కాటులకు, వీధికుక్కల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం మందస ప్రాజెక్ట్‌లో ఉజ్వల ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యకరమైన ఆహార ఎంపిక నినాదంతో పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వెంకటరమణ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పి.అరుణ, సూపర్‌వైజర్ సీహెచ్.వి.రామలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త, గ్రామ లబ్ధిదారులు పాల్గొన్నారు.



## హంసరాళి, నర్సింగపురంల్లో పోషణ్ పక్వాడా



**మందస, ఏప్రిల్ 23(వార్త):** హంసరాళి, నర్సింగపురం అంగన్ వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమాలు జరిగాయి. ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు పరిధిలోని మందస సెక్టార్-1లో ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ సూపర్ వైజర్ సీహెచ్.వి.రామలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు బర్గర్లు, ఫిజ్జాలు తదితర జంక్ ఫుడ్స్ ఇవ్వవద్దని హితవు పలికారు. పాతపద్ధతిలో తయారు చేసిన ఆహార పదార్థాలే పిల్లలకు ఉత్తమమన్నారు. ఇవి పోషక విలువలు కలిగి ఉంటాయన్నారు. కూల్ డ్రింక్స్ ఇవ్వవద్దన్నారు. అదేవిధంగా పిల్లలు ఏడుస్తున్నారని.. అల్లరి చేస్తున్నారని.. సెల్ ఫోన్లు వారికి చేతికి ఇవ్వవద్దన్నారు. పలుమార్లు ఈ విధంగా చేస్తే మొబైల్ ఫోన్లకు అలవాటు పడి వ్యసనంగా మారుతుందన్నారు. మొబైల్ ఫోన్లకు అడిక్ట్ అయితే అది వారి మానసికస్థితి మార్చేసే అవకాశం ఉందన్నారు. పాతపద్ధతిలో కథలు, చెప్పడం, పుస్తకాలు చదివించడం చేయాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో నర్సింగపురం, హంసరాళి అంగన్ వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## 25న ప్రజా సంఘాల పర్యటన

**మందస, ఏప్రిల్ 23(వార్త):** ఉద్దానంలో నిర్మించతలపెట్టిన కార్గో ఎయిర్ పోర్టును భూములు కోల్పోనున్న రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే వీరంతా పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటానికి ప్రజా సంఘాల సంఘీభావం తెలియజేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 25న కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలియజేసేందుకు ఉద్దానం ప్రాంతంలో పర్యటిస్తున్నట్టు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మందస మండలంలోని హరిపురంలో గల మార్పు గ్రంథాలయం వద్దకు ఉదయం 9.30గంటలకు చేరుకోవాలని, అక్కడ నుంచి రాంపురం గ్రామానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు గమనించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## విజేతలకు బహుమతులు




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23(వార్త):** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సూచనల మేరకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శాంతినికేతన్ స్కూల్లో క్విజ్,డ్రాయింగ్, స్పీచ్ లలో పోటీలు నిర్వహించారు. క్విజ్ ప్రథమ స్థానం డి.నాని, ద్వితీయ స్థానం డి.రక్షిత, తృతీయ స్థానం పి.దివ్య, డ్రాయింగ్ ప్రథమస్థానం శీతల్ పాణిగ్రాహి, ద్వితీయ స్థానం శృతి సాహూ ,తృతీయ స్థానం రవీంద్రరావు , స్పీచ్ ప్రథమ స్థానం డి. హర్షవర్ధన్ రెడ్డి , ద్వితీయ స్థానం స్వాతి, తృతీయ స్థానం శివశంకర్ లు నిలిచారు. విజేతలకు స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి మెడల్స్ ను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేఖ,శంకర్, పద్మజ, రాజ్యలక్ష్మి, యశోద, జయలక్ష్మి,మీనా, పార్వతి ప్రమీల, స్నేహ, సరోజినీ ప్రియదర్శిని, శిరీష పాల్గొన్నారు.

## 29న శ్రీమాత మానసాదేవి ఆలయ వార్షికోత్సవాలు

### -ముఖ్య అతిథిగా సినీ నటుడు శ్రీకాంత్ రాక



**జలుమూరు, ఏప్రిల్ 23 (వార్త):** చిన్నదూగాంలో కొలువైన శ్రీ మాత మానసా దేవి (నాగదేవత) ఆలయ 23వ వార్షికోత్సవాలను ఈనెల 29న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు డీవీ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలి పారు. భక్తుల కోసం వివిధ సేవా కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు సినీ నటుడు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# దేవుడికే శఠగోపం..!

- ఇచ్ఛాపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమి కబ్జా
- అధికారులకు ఆలయ పూజారుల ఫిర్యాదు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- స్పందించాలని కోరుతున్న అర్చకులు



**శ్రీకాకుళం క్రైమ్, ఏప్రిల్ 23 (వార్త):** భూ అక్రమార్కుల ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. రోజురోజుకీ భూముల ధరలు ఆకాశన్నంటుండడంతో కబ్జాకు కాదేదీ అనర్హమన్నట్టు వ్యవహరిస్తున్నారు భూ బకాసురులు. దేవుడి మాన్యాన్ని కూడా వారు ఆక్రమించడానికి వెనుకాడడం లేదు. ఇచ్ఛాపురంలోని ఉగ్రనరసింహ స్వామి ఆలయానికి చెందిన భూములు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై ఆ ఆలయ పూజారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధి ఇండియన్ గ్యాస్ గొడౌన్ ఎదురుగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయానకి సంబంధించిన భూమిని పట్టణానికి చెందిన కొందరు కబ్జా చేశారని ఆలయ అర్చకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం విలేఖరులతో ఆలయ అర్చకులు మన్మోహన్ పండా, తల్లి నిరుపమ పండా తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెల్లడించారు. ఆలయానికి సంబంధించిన 6.54 ఎకరాల భూమి ఉండేదని, దీంట్లో ఆరు ఎకరాలు ఆర్టీసీ డిపో కట్టేందుకు, మరికొంత భూమి సంతోషిమాత, తారకేశ్వర ఆలయ నిర్మాణానికి ఇచ్చామని, మిగిలిన భూమి దేవాలయం ఆధీనంలో ఉండేదన్నారు. దీనిపై కన్నేసిన పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని అడిగితే ఎదురు తిరుగుతున్నారని, తమకు పట్టాలు ఉన్నాయని ఆ స్థలం మాదే అని బెదిస్తున్నారని. ఈ విషయాన్ని గతంలో జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓకు, తహశీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేసినా, ఎవరూ పట్టించుకోలేదని కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి కూడా తీసుకెళ్లామని, ఆయన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరారు.

## ఉపాధ్యాయుడు గోపాలకృష్ణకు అరుదైన అవకాశం



**మందస, ఏప్రిల్ 23(వార్త):** కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పని చేస్తున్న గంట గోపాలకృష్ణకు అరుదైన అవకాశం దక్కింది. 4, 5వ తరగతులకు సంబంధించి పరిసరాల విజ్ఞానం పుస్తక రచనలో అవకాశం ఆయనకు వచ్చింది. మందస మండలంలోని కొత్తపల్లి పాఠశాలలో పని చేస్తున్న గోపాలకృష్ణకు ఈ గౌరవం దక్కడం గొప్ప విషయమని కొత్తపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు అన్నారు. మంగళగిరిలోని విద్యాభవన్ లో రాష్ట్ర విద్యా పరిశోధనా న మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ పుస్తక రచనలో భాగంగా ప్రస్తుతం ఆయన నాలుగు వర్క్ షాప్ లలో పాల్గొని, కొత్తపల్లి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చారన్నారు. స్థానిక పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, కొత్తపల్లి గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. పుస్తక రచనకు శ్రీకాకుళం జిల్లా నుండి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడు గోపాలకృష్ణ కావడం గొప్పవిషయమని, ఆయన భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పాఠశాల సిబ్బంది ఆకాంక్షించారు. పాఠశాలలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు.

సన్మాన కార్యక్రమం లో ఉన్నత పాఠశాల పీఎంసీ చైర్పర్సన్ ప్రతినిధి కోమటి తిరుపతిరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెట్ట దామోదరం, ఉపాధ్యాయులు జి.భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి.సూర్యనారాయణ, జి.చిన్నికృష్ణ, బి.రమేష్, పి.అఖిల, స్థానిక అంగన్వాడీ టీచర్ వై.పార్వతి విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యతోనే సామాజిక వికాసం




**కవిటి, ఏప్రిల్ 23(వార్త):** సామాజిక వికాసానికి విద్య ఎంతగానో తోడ్పడుతుందని సోంపేటకు చెందిన శ్రీశయన చైతన్య దీపిక ప్రతినిధులు పేర్కొన్నారు. రాజపురం గ్రామంలో శ్రీశయన సంఘ భవనం వద్ద గురువారం విద్యా చైతన్య సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులను తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఇంట్లోనూ విద్యార్థి ప్రయోజకుడు అయినప్పుడే ఆ ఇంటిలో విద్యా దీపం వెలిగి ఎంతగానో వికసిస్తుందని కుటుంబం వృద్ధి చెందుతుందని అన్నారు. చిన్నప్పటి నుంచి పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి చదువుల విషయంలో వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో తగువిధంగా సహకరించాలని కోరారు. పిల్లలు ప్రయోజకులు అయ్యేంతవరకు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం తగదని అన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు బల్ల కాంతారావు పత్రి సాయిరాజ్ సంస్థ ప్రతినిధులు దేవాడ మోహన్ రావు దుద్ది వీర్రాజు మాట్లాడుతూ మారుతున్న విద్య పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగ పోటీ ప్రపంచంలో నిరంతరం విద్యార్థులు సైనికులుగా పోరాడాలని సూచించారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరేంతవరకు పట్టుదలగా శ్రమించాలని సూచించారు. లక్ష సాధన వరకు నిరంతరం విద్య పైనే దృష్టి సారించాలని కోరారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు కలసి కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్ల జానకిరామ్ బీన ఆనందరావు దూగానా లోకనాథం పత్రి చంద్రయ్య లొట్టి సోమేశం బత్తిన హేమాచలం ఆణింగి భాస్కరరావు లొట్టి తారాకేష్ పాల్గొన్నారు.

## జనగణన బాధ్యతాయుతంగా నిర్వహించాలి



**జి.సిగడాం, ఏప్రిల్ 23(వార్త):** జనగణనను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అన్ని వివరాలను తప్పులు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మీసాల వెంకటరమణ, ఎంపీడీఒ జి. రామకృష్ణారావు, తహాసీల్దార్ ఎం.సరిత అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన మూడవ చివరి దశ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ తప్పులు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలన్నారు. డిజిటల్ సర్వేపై అనుమానాలు నివృత్తి చేయాలని, గత సర్వేల్లో పాల్గొన్న సిబ్బంది అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మొదటి దశలో మే11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల గణన నిర్వహిస్తారని, రెండవ దశలో ఫిబ్రవరి 2027లో వ్యక్తులవారీగా సమాచారం సేకరిస్తారని తెలిపారు. అధికారులు ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు.



## వైభవంగా వేణుగోపాల స్వామి ఆలయ పునఃప్రతిష్ట



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23(వార్త):** కొఠారి గ్రామంలో వేణుగోపాల స్వామి దేవాలయ పునః ప్రతిష్టా, హరే రామ హరే కృష్ణ నామ యజ్ఞం ఆధ్యాత్మిక చింతనతో భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతుంది.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు, ఇచ్ఛాపురం మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు మండల నాయకులతో పాల్గొని సందర్శించి, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్ పద్మనాభం, మాజీ ఏఎం సి చైర్మన్ సహదేవ్, డి కామేశ్వరరావుఏపి రాష్ట్ర ప్రభుత్వం నాటక అకాడమీ డైరెక్టర్, మణి చంద్ర ప్రకాశ్, శ్రీనివాస్ రౌళో, పి.కృష్ణారావు, బి.చిన్న బాబు, పురుషోత్తం, ఐటీడీపీ మండల అధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, ఎ.మాధవరావు, బి .యువరాజ్ , యాదవరావు, సహదేవ్, డి. ధనలక్ష్మీ. దేవరాజు రెడ్డి,గ్రామ పెద్దలు కమిటీ, పూజ కమిటీ సభ్యులు యజ్ఞం కోసం పనులు కమిటీ సభ్యులు కార్యక్రమ లో భక్తులు, చుట్టు పక్కల గ్రామ లా భక్తులు పెద్దలు మహిళలు యువత చిన్నారులు ప్రజలు , తదితరులు పాల్గొన్నారు.

## ఎం.తోటూరులో చలివేంద్రం ఏర్పాటు




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23(వార్త):** నార్త్ కేబిన్ వద్ద ఎం.తోటూరు , యువసూర్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎం..రాంబాబు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసారు.మండపల్లి మాజీ సర్పంచ్ పిట్టా శేషిరేఖ,ఎంపీటీసీ కాళ్ళ గోపి ,మాజీ కౌన్సిలర్ బచ్చు జగన్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో పిట్ట మామయ్య, ఈశ్వర్ రావు,.వెంకటేష్ వరదరాజు, మోహన్ కృష్ణ ,యువత గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సెన్సెస్ అవగాహనకు పోటీల నిర్వహణ

### -జలుమూరులో విద్యార్థులకు మెడల్స్ ప్రదానం



**జలుమూరు, ఏప్రిల్ 23 (వార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెన్సెస్‌పై అవగాహన కల్పించేందుకు జలుమూరులో పెయింటింగ్, డిబేటింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించిన ఈ పోటీలలో మండలంలోని 22 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురికి చొప్పున విజేతలను ఎంపిక చేసి మెడల్స్ అందజేసినట్లు వారు తెలిపారు. విద్యార్థుల్లో సెన్సెస్‌పై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం ఏప్రిల్ 23 (వార్త):** మందస మండలం, సువర్ణ పురం కి చెందిన ఇప్పిలి నాగేశ్వరరావు నోములమ్మ దంపతుల పెద్ద కొడుకు ఇప్పిలి గగన్ కొన్ని రోజులుగా సికిల్ సెల్ అనీమియా అనే వ్యాధి తో బాధ పడుతున్నాడు. పరిస్థితి విష మించడం తో ప్రస్తుతం వైజాగ్ లోని మెడికవర్ హాస్పిటల్ లో ట్రీట్మెంట్ పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకొని బెల్లుపడా యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బాబు వైద్యానికి15000వేల రూపాయలు హాస్పిటల్ ఖర్చులు నిమిత్తం లకు సహాయం అందజేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రోబోటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23 (వార్త):** జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లోరోబోటిక్స్ పై విద్యార్థులు కు అవగాహన కల్పించారు. రోబో టిక్స్ పై పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ అవకాశాలను పొందగలుగుతారని పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ అన్నారు. యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ తో సంయుక్తంగా ఓ ఎల్ ఎల్ సంస్థ ఘన భారతి పాఠశాలలో నిర్వహిస్తున్న రోబోటిక్స్ విభాగంలో విద్యార్థులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది ఐఐటి ముంబైలో జరిగే రోబోటిక్స్ విభాగ ప్రదర్శనకు పాఠశాల నుంచి కూడా పలువురు విద్యార్థులు పాల్గొంటున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండ, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తరాంధ్ర ప్రజా కళలను ప్రభుత్వం పరిరక్షించాలి

### - కవులు, కళాకారులు, రచయితల డిమాండ్



**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** రంగం ప్రజా సాంస్కృతిక వేదిక శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న తప్పెటగుళ్ళ శిక్షణ శిబిరంలో భాగంగా ఉత్తరాంధ్ర కళలు సాహిత్య పరిరక్షణ సదస్సుని గురువారం నిర్వహించారు. ఈ సదస్సులో ప్రధాన వక్తులుగా పాల్గొన్న ఉత్తరాంధ్ర సాహిత్య పరిశోధకులు బద్రి కూర్మారావు మాట్లాడుతూ జానపదాలు అంతరించిపోతున్నాయని, ఆ జానపదాలను, సాహిత్యాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావాలని, ఇప్పటికే నా వంతుగా చేసిన కృషి ఫలితంగా పిల్లలకు పాఠ్యాంశంగా ఉత్తరాంధ్ర పాటలు పరిచయమవుతున్నాయని, ఇది మాత్రమే సరిపోదని, జానపద కళల్ని కాపాడుకోవడం ద్వారా ఇక్కడ యాసని భాషని రక్షించుకోవడానికి అందరూ నడుం కట్టాలని కోరారు. సీనియర్ కళాకారులు కుమార్ నాయక్ మాట్లాడుతూ సినిమా వెండితెరపై ఉత్తరాంధ్ర పాటలు కళారూపాలు దర్శనమిస్తున్నాయని, కేవలం వారి వ్యాపార లాభాలకు మన జానపద కళలను సాహిత్యాన్ని వినియోగిస్తున్నారని అన్నారు. ఈ జానపద కళా సంపదని రక్షించి భావితరాలకు తెలియజేయాలని, అలాంటి కృషి రంగం చేస్తుందని అభినందించారు. చరిత్ర సాంస్కృతి పరిశోధకులు ప్రజాగాయకులు గంద్రెటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న కళాకారులను ప్రభుత్వం గుర్తించి వారికి తగిన ప్రోత్సాహకాలు అందించాలని, ఉత్తరాంధ్ర ప్రాంత కళాకారులకు ప్రాధాన్యత నివ్వాలని కోరారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే కొన్ని కళారూపాలు కనుమరుగయ్యాయని, ఉన్న కొద్దిపాటి కళలను ఆసాహిత్యాన్ని పరిరక్షించుకోవడానికి అందరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని అన్నారు. జానపదాలను భావితరాలకు నేర్పించే శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తద్వారా యువ కళాకారులకు మన కళల పట్ల అవగాహన పెరుగుతుందని రంగం జిల్లా ఉపాధ్యక్షులు బెందాళం రాజేష్ అన్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక రాపాక ధనరాజు మాట్లాడుతూ తప్పెటగుళ్లు కళారూపాన్ని ప్రాచుర్యం కల్పించి, మరింతగా కళాకారులకు అవకాశాలు కల్పించాలని, అందుకు సిక్కులు జానపద సాహిత్య కళావేదిక కృషి చేస్తుందని అన్నారు. యుటిఎఫ్ నాయకులు ఎల్ వి చలం మాట్లాడుతూ జానపద కళలు, సాహిత్యము అమూల్యమైనవని, ఆ జానపద కళల ద్వారా మన మన భాష సంస్కృతి పరిరక్షణ జరుగుతుందని, పాఠశాల విద్యార్థులకు మన కళారూపాలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందని, తద్వారా వాళ్ళ మానసిక శారీరక వికాసానికి కూడా ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థుల కర్ములంలో తెలుగు జానపద పాటలు ఆటలు పెట్టాలని కోరారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రంగం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కొర్రయి శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుబ్బారావు పాణిగ్రహి లాంటి వారు ప్రజా కళలను వెలుగులోకి తీసుకొచ్చారని, ప్రజా చైతన్యానికి విప్లవ ఉద్యమాలకి ప్రజా కళలు ఎంతగానో దోహదపడ్డాయని అన్నారు. మారిన కాలంలో జానపద ప్రజా కళలకు ఆదరణ తగ్గిందని, ప్రభుత్వాలు తమ వంతు బాధ్యతగా ఈ ప్రాంత కళాకారులను కళలను కాపాడుకోవాలని అన్నారు. సదస్సులో తమ అభిప్రాయాలను చెప్పినటువంటి వక్తల తో మాట్లాడి అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని సదస్సు మూడు తీర్మానాల్ని ప్రభుత్వానికి పంపాలని తీర్మానం చేశారు. మొదటి తీర్మానం ఉత్తరాంధ్ర ప్రాంత కళలు, సాహిత్యాన్ని అధ్యయనం చేయటానికి ఒక ప్రత్యేక కమిటీని 20 మందితో ఏర్పాటు చేయాలని, ఒక సంవత్సరం పాటు ఆ కమిటీ ఈ ప్రాంతంలో కళల్ని అధ్యయనం చేసి సాహిత్యాన్ని, పాటల్ని, బాణీల్ని సేకరించి గ్రంథస్తం చేయడం ద్వారా భావితరాలకు అందించడానికి ఉపయోగపడుతుందని, ప్రభుత్వం అటువైపుగా చర్యలు తీసుకోవాలని సదస్సు తీర్మానం చేశారు. రెండవ తీర్మానం తప్పెటగుళ్ళు, కోలాటం, చెక్కభజన, ఇతర కళారూపాల గురువులను గుర్తించి, భావితరాలకు నేర్పించే శిక్షణ శిబిరాల కేంద్రాలను ప్రభుత్వం నిర్వహించాలని, ఈ ప్రాంతంలో ప్రసిద్ధ దేవాలయాల ఆదాయంలో నుంచి 10% స్థానికంగా జరిగే పండుగలు ఉత్సవాలు ఊరేగింపులలో కళాకారులకు ప్రదర్శన అవకాశాలు కల్పించాలని, వారిని ప్రోత్సహించాలని సదస్సు అభిప్రాయ వ్యక్తం చేసింది. మూడవ తీర్మానం ఉత్తరాంధ్ర ప్రాంతంలో జానపద కళల పైన సాహిత్యం పైన, కృషిచేసినా కవులను, కళాకారులను, రచయితలను, సాహిత్య వేతలను గుర్తించి, ప్రభుత్వం అందించే ఉగాది, హంస ఇతర అధికారిక పురస్కారాలకు ఈ ప్రాంత కళాకారులకు ప్రాధాన్యత నివ్వాలని సదస్సు తీర్మానించింది. వృత్తి కళాకారులను కళనే జీవనాధారంగా బ్రతుకుతున్న కళాకారులను గుర్తించి, డప్పు కళాకారులకు 50 సంవత్సరాలకే ఇస్తున్న పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని సదస్సు అభిప్రాయపడింది. ఈ మూడు తీర్మాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మానాల కాపీని ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ కి రంగం ప్రజా సంస్కృతి వేదిక అందిస్తుందని రాష్ట్ర కార్యదర్శి కళ రత్న రంగం రాజేష్ వెల్లడించారు. అనంతరం తప్పిట గుళ్ళు కళారూపం గురువులకు సదస్సులో పాల్గొన్న ముఖ్య వక్తలకు రంగం శ్రీకాకుళం జిల్లా కమిటీ తరపున ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో రంగం రాష్ట్ర అధ్యక్షులు అనంత కరుణాకర్ బాబు, ఉపాధ్యక్షులు కౌనారి హేమ సోదన్, రాష్ట్ర కార్యదర్శి రంగం రాజేష్ లు, రంగం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కోర్రాయి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## భవిత కేంద్రాన్ని సందర్శించిన కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి

### -విద్యార్థులకు శిక్షణా మాడ్యూల్స్ పంపిణీ




**జలుమూరు, ఏప్రిల్ 23 (వార్త):** జిల్లా భవిత కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి జలుమూరు మోడల్ ప్రైమరీ స్కూల్‌లోని భవిత కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాధవరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వృత్యాంతర శిక్షణా మాడ్యూల్స్ అందజేశారు. ఈ మాడ్యూల్స్‌ను భవిత విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం "బడి పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్

### -యలమంచిలి పాఠశాల ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన



**జలుమూరు, ఏప్రిల్ 23 (వార్త):** యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న గ్రామాలలో విద్యార్థుల అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం గొద్దు రఘునాధరావు తెలిపారు. బుధవారం రాత్రి ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలు, అందిస్తున్న సదుపాయాలను స్థానికులకు వివరించారు. తల్లిదండ్రులను ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామస్థులు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

### - 100 సీట్ల భర్తీకి సెలెక్షన్ లిస్ట్ సిద్ధం




**జలుమూరు, ఏప్రిల్ 23 (వార్త):** జలుమూరు మండలం కరవంజలోని మోడల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ నెల 12వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు వెల్లడించారు. రిజర్వేషన్ విధానాన్ని అనుసరించి సెలెక్షన్ లిస్ట్ రూపొందించి మొత్తం 100 సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 315 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 9 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నిర్దిష్ట తేదీల్లో ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

## జలుమూరులో రూ.8.47 కోట్ల పనులకు నేడు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శ్రీకారం



**జలుమూరు, ఏప్రిల్ 23 (వార్త):** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జలుమూరు మండలంలో శుక్రవారం భారీ స్థాయిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. నరసన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో పర్యటిస్తూ సుమారు ?8.47 కోట్ల వ్యయంతో నిర్మించిన 17 అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేయనున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+చీ-=జు+రా) నిధులతో తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల వంటి మౌలిక వసతులు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు మర్రివలస రోడ్డును ప్రారంభిస్తూ కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం నగరికటకం, పర్లాం, అల్లాడ, పాగోడు, చెన్నాయివలస, జలుమూరు, తలతరియా, లింగాలవలస, రావిపాడు గ్రామాల్లో వరుసగా ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## విద్యతోనే ఉన్నత స్థితికి చేరుకోవచ్చు



**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** విద్యతోనే ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు పేర్కొన్నారు. చదవడం ద్వారా ఉన్నతస్థితికి చేరుకోగలమని, తద్వారా మన జీవితాలను వృద్ధి చేసుకోగల అవకాశం కలుగుతుందని, ఊరిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను వదిలి డబ్బులు పెట్టి బయటకు వెళ్లాలనుకునే తల్లిదండ్రులు, విద్యార్థులు ఒకసారి ఆలోచించుకోవాలని, లేనిపోని గొప్పలకు పోయి తిప్పలు పడొద్దు అంటూ వినూత్నంగా గురువారం వజ్రపుకొత్తూరు మండలం లోని, నగరంపల్లి - జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడి పిలుస్తోందని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కొత్త అడ్మిషన్లు కోసం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని, ఊరు బడిని కాపాడుకుందాం అంటూ లక్ష్మి దేవి పేట (నువ్వలరేవు ), రాజి పేట, కాశీనగర్ గ్రామాలలో ప్లకార్డులుతో ర్యాలీగా వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బి. లక్ష్మిపతి, ఉపాధ్యాయ సిబ్బంది టి.యరన్న, పి.సోమేశ్వరరావు, కొయ్యల శ్రీనివాస రావు, ఎల్.శ్రీదేవి, ఎన్.మంగరాజు, పి.గజేంద్ర, జె.నారాయణ, ఎమ్. అప్పలరా మయ్య, జి.విశ్వనాధం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలికి సత్కారం



**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు బమ్మిడి సీతమ్మ ఉద్యోగ పదవి విరమణ సందర్భంగా ఘనంగా అభినందన సభ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ ముఖ్య అతిథులుగా హాజరై సీతమ్మ, కేశవ నారాయణని ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బమ్మిడి సీతమ్మ సుమారు 42 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో సేవలు అందిస్తూ అనేక మంది విద్యార్థులను విద్యాబుద్ధులతో తీర్చిదిద్దారని కొనియాడారు. ఆమె కృషి వల్ల పాఠశాల అభివృద్ధికి విశేషంగా తోడ్పడటమే కాకుండా, గ్రామంలో విద్యా ప్రాధాన్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేసిన ఆమె సేవలు ఆదర్శప్రాయమని పేర్కొంటూ, ఆమె ఆరోగ్యం సుఖశాంతులతో ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఆమె మార్గదర్శకత్వంలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించారని కూడా గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రత్నాల తుంభనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతమ్మకి శుభాకాంక్షలు తెలిపారు.

# పలాసలో రేపు విద్యుత్ అంతరాయం

**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** పలాసలోని 33/11 కేవీలో అభివృద్ధి పనులు నిమిత్తం శనివారరం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పలాస డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. 2 ఎన్ ఓఎస్, పి టి ఆర్ ఎస్, అన్ని 11కేవ్ ఫీడర్ లో లైన్స్ మార్చుటకు కారణంగా మొగలిపాడు , ఉల్లాసపేట దేకురకొండ ఏరియా, దత్తాపీఠం ఏరియా సీతారామ నగర్ శ్రీనివాసనగర్ (పలాస), ఉద్యపురం, తాసిల్దార్, ఆర్డీవో కార్యాలయ ప్రాంతాల్లో, శాసనం , పురుషోత్తపురం, వాసుదేవ పేట , ఎస్ బిఐ ఏరియా , గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, బత్తులవీధి, పెద్దవీధి, బద్దిపోలమ్మ గుడి ఏరియా, టోల్ గెట్, కరెంట్ ఆఫీస్ టు ఇందిరాగాంధీ బొమ్మ ఏరియా, జీజ్ కాలేజీ రోడ్ , మున్సిపాల్ ఆఫీస్ ఏరియా, గాంధీ నగర్, శారదానగర్, ఫిష్మార్కెట్ , కాశీబుగ్గ డెంకివీది, హరిజన వీది, న్యూ కాలనీ, పోలీస్ స్టేషన్ ఏరియా, ఆంధ్ర బ్యాంకు రోడ్, పల్లి వీది పరిసర ప్రాంతాలలో ఎస్ బి ఎస్ స్కూల్ ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగ వచ్చునని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలికిపెంట పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం

**సరుబుజ్జిలి, ఏప్రిల్ 23 (వార్త):** సరుబుజ్జిలి మండలం తెలికి పెంట పంచాయతీ పరిధిలో ఉన్న పాతపాడు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మన్మధరావు సహోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ ఎమ్ఈ ఓ బాలరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర, పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానాల గురించి చక్కగా వివరించారు.కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బగ్గు అప్పలరాజు , సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు, ఆశా వర్కర్లు, ఎమ్ ఆర్ సి సిబ్బందిలిబెండి చిన్నారరావు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన తీరును అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.



## భూ రీ సర్వేను పక్కాగా నిర్వహించాలి

### - జలుమూరులో ఆర్డీవో సమీక్ష సమావేశం



**జలుమూరు, ఏప్రిల్ 23 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనసాగుతున్న రెండవ విడత సమగ్ర భూ రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని ఆర్డీవో సాయి ప్రత్యూష ఆదేశించారు. బుధవారం జలుమూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామారావు మరియు సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ రికార్డుల సరిదిద్దడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్కురాడ సచివాలయ పరిధిలో మొత్తం 924 మంది రైతులకు పాసు పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 870 పాసు పుస్తకాలు సిద్ధం చేసినట్లు వివరించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## పాఠశాలల్లో ప్రతిభా పోటీల సందడి

### - క్విజ్, వ్యాసరచన, డిబేట్‌తో విద్యార్థుల్లో వికాసం

**సారవకోట, ఏప్రిల్ 23 (వార్త):** సారవకోట మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు పలు విద్యా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఎంవి రమణ సూచనల మేరకు చివరి వర్కింగ్ డేగా గుర్తించి అన్ని తరగతుల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డిబేట్ వంటి పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభించింది. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంపొందించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పలాస ఎమ్మెల్యేకు సన్మానం

**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి, పలాస ఎమ్మెల్యేకు గురువారం 31 వార్డ్ ఇంచార్జ్ కోరికన శంకర్రావు బృందం సన్మానం చేశారు. పలాస నియోజకవర్గం శాసనసభ్యులు గౌతు శిరీష మన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ పార్టీ ప్రజాసేవా నిర్మాతల మద్దతు, కుటుంబ వారసత్వంతో కలిసిన జాతీయ స్థాయి రాజకీయ సాధన కొనసాగిస్తా అని గౌతు శిరీష స్పష్టం చేశారు. పలాస, శ్రీకాకుళం సహా ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల అభివృద్ధి, సమీక్ష సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెడుతామని హామీ ఇచ్చారు. ఈ సన్మానంలో టిడిపి నాయకులు శాసుమన మౌళి, సంతోష్, దేవుడయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## భక్తులకు మజ్జిగ పంపిణీ



**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం కాశీబుగ్గ రైల్వే రామాలయం ఆవరణలో భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేశారు. వారం రోజులపాటు కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు నిర్వహణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రయాణికులు, భక్తులు, వృద్ధులు, యాచకుల దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 550 మందికి పైగా మజ్జిగ పంపిణీ చేశారు . ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంపై భక్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. మజ్జిగ పంపిణీకి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యుఏసి కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్. శ్రీనివాస పట్నాయక్, లైబ్రేరియన్ బి నరసింహులు, డాక్టర్ వై. వెంకటలక్ష్మి, డాక్టర్ పి. మధు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాలను చేరుకోవాలి



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23 (వార్త):** ఇచ్చాపురం పురపాలక సంఘము మెప్మా సిబ్బంది అర్ పి లతో మెప్మా పథక సంచాలకులు బొడ్డేపల్లి శైలజ రివ్యూ మీటింగ్ నిర్వహించారు.ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపడుతున్నటువంటి కార్యక్రమాలు మొబైల్ బుక్ కీపింగ్, డిజిటల్ , స్ట్రీట్ వెండార్స్ పీఎం స్వానిది లోన్స్, స్పెషల్ ప్రాజెక్టు పైన అవగాహనా కల్పించారు.సి వో లు అందరూ తమ లక్ష్యాలను చేరుకొని పురపాలక సంఘము పురోగతి సాధించాలని సూచనలు ఇచ్చారు .కార్యక్రమం లో రాము, భాస్కరరావు, సంతోష్, బాలరాజు, శ్రీనివాస్, అధ్యక్షురాలు సుధారాణి అర్ పిలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేతో మెప్మా పీడీ భేటీ



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23 (వార్త):** ఇచ్చాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాలం అశోక్‌ను మెప్మా పథక సంచాలకులు బొడ్డేపల్లి శైలజ గౌరవ పూర్వకం గా కలసి మెప్మా ప్రతిష్టత్మకంగా చేపడుతున్నటువంటి కార్యక్రమాలు వివరించారు. మొబైల్ బుక్ కీపింగ్, డిజిటల్ ప్రాజెక్టు ల గురుంచి వివరించారు. ఈ కార్యక్రమం లో రాము, భాస్కరరావు,సంతోష్, బాలరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వైసీపీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

### - మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



**పలాస, ఏప్రిల్ 23(వార్త):** వైసిపి బలోపేతానికి చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. గురువారం పలాస నియోజకవర్గం, వజ్రపుకొత్తూరు మండలంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి క్లస్టర్‌కు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి కమిటీల ఏర్పాటుతో పాటు డిజిటలైజేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను సక్రమంగా అమలు చేసి శతశాతం పూర్తిచేయాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి ఈ ప్రక్రియలు కీలకమని పేర్కొంటూ అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పి గురయ్య నాయుడు, మధుకేశ్వరరావు, ప్రేమ్ కుమార్, వైసిపి కార్యకర్తలు, క్యాడర్ పాల్గొన్నారు.

## ఉప రాష్ట్రపతిని శ్రీకాకుళం ఆహ్వానించిన కేంద్ర మంత్రి రామ్మోహన్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 23 (వార్త):** భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌తో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈనెల 27న విశాఖలో జరిగే ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ వస్తున్న నేపథ్యంలో ముందస్తు ఆహ్వానం పలికిన రామ్మోహన్ నాయుడు.. శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు అరసవల్లి, శ్రీకూర్మం కూడా దర్శించాలని కోరారు. దీనిపై ఉప రాష్ట్రపతి కూడా సానుకూలంగా స్పందించినట్టు రామ్మోహన్ నాయుడు తెలిపారు.

# బాహుదా వంతెన మరిచారా అశోక్..?

### -ప్రశ్నించే జనసేన ప్రశ్నలు మరిచారా?

### -వైసీపీ నాయకుల ధ్వజం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23 (వార్త):** ఇచ్ఛాపురం బాహుదా వంతెన కూలి మూడేళ్లు గడుస్తున్నా కూటమి ప్రభుత్వానికి తీరిక లేదా అంటూ వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం శిధిలావస్థలో ఉన్న బాహుదా వంతెనను వైసీపీ నాయకుల బృందం పరిశీలించింది. మూడేళ్ల క్రితం బాహుదా వంతెన కూలడంతో అప్పట వైసీపీ ప్రభుత్వం తాత్కాలిక నిధులు మంజూరు చేసి ప్రత్యామ్నాయ రహదారిని కల్పించారని అన్నారు. అనంతరం 20 కోట్ల రూపాయలు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయని అన్నారు. తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేశారని అన్నారు .ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాలం అశోక్‌కు గుర్తులేదా అంటూ వైసీపీ నాయకులు ప్రశ్నించారు. అప్పటి ఎంపీ ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తామ అధికారంలోకి వచ్చి నిర్మించి తీరుతామని చెప్పి రెండేళ్లు గడుస్తున్నా ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారు. అప్పట్లో వంతెన కూలిన అరగంటలో జనసేన నాయకులు వచ్చి 24 గంటలలో పనులు ప్రారమిభించాలని ప్రశ్నించి ప్రభుత్వాన్ని హెచ్చరించి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక రెండేళ్లయినా జనసేన నాయకులకు ప్రశ్నించే తీరిక లేదా లేక ప్రశ్నించే ప్రశ్నలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. కావాలంటే క్వశ్చన్ బ్యాంక్ పంపిస్తామని ధ్వజమెత్తారు. బాధ్యతలు మరిచిన ఎమ్మెల్యేకు బాధ్యతలు గుర్తు చేస్తామని హెచ్చరించారు. ఫైట్ ఫర్ బెటర్ ఇచ్ఛాపురం అనే నినాదంతో ప్రజా సమస్యలపై గళం విప్పుతామని అన్నారు. రెండేళ్లు ఎదురు చూశామని ఇక పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. ఒక సంతకంతో టెండర్లన్నీ రద్దుచేసి తిరిగి పనులు ప్రారంభించడానికి రెండేళ్లు సరిపోదా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు, కేంద్రమంత్రికి ఈ బ్రిడ్జిపై వెళ్లే సాహసం చేయలేరా అంటూ ప్రశ్నించారు. బెల్లు పడా రోడ్డు తాత్కాలిక ప్రత్యామ్నాయమైనప్పటికీ రెండేళ్లుగా వాహనాల రాకపోకలతో రద్దీపెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందారని ఆ ప్రమాదాలకు ఎమ్మెల్యే బాధ్యత వహించాలని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న డొంకురు బూర్జపాడు, మహేంద్ర తనయా వంతెన లు తమ ప్రభుత్వం యా హయంలోనే వచ్చాయని చెప్పారు. డయాలసిస్ కేంద్రం కూడా తమ ప్రభుత్వం హయాంలోనే వచ్చిందని అన్నారు. 12 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న అశోక్ చేసిన 12 పనులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మొద్దు నిద్ర వీడే వరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు.

కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ ,ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాసు రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, మాజీ వైస్ చైర్పర్సన్ ఉలాల భారతి దివ్య, చల్ల దేవరాజు , ప్రేమ్ కుమార్ యాదవ్, నీలాపు ఢిల్లీ, తేజ, శాలిన గాంధీ, వంశీ, కారంగి మోహన్ రావు, చాట్ల తిరుపతి, సుగ్గు ప్రేమ్ కుమార్, ప్రతి అన్వేష్, సాడి జయరాం రెడ్డి, పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, కారంగి త్రినాధరెడ్డి, బతకల మోహన్ దాస్, లోపింటి దీనబంధ రెడ్డి, కాళ్ల సత్యరాజ్ యాదవ్, రామ్మూర్తి, సయ్యద్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలోనూ విద్యార్థులకు పోషకాహారం

### -డీఈవోతో ఎమ్మెల్యే గౌతు శిరీష సమీక్ష



**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** వేసవి సెలవుల్లోనూ విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విష యంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం పలాసలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీషను డీఈవో రవిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల పాఠశాలల్లో పోషకాహార కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని, దీని ద్వారా సుమారు 15 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. విద్యార్థులకు గుడ్లు, పాలు, రాగిజావ, పోషకాహార పదార్థాలు అందజేస్తామని, ముఖ్యం గా గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, శుభ్రత, తాగునీటి సదుపాయా లపై దృష్టి సారించా లని, విద్యార్థుల హాజరు, ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికా రులను ఆదేశించారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో వంశధార ఎడమ కాలువ గట్లు

### - మరమ్మతులు చేయాలని రైతుల డిమాండ్



**జలుమూరు, ఏప్రిల్ 23 (వార్త):** వంశధార ఎడమ కాలువ గట్లు పూర్తిగా శిథిలమవుతున్నాయని జలుమూరు మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 13 కిలోమీటర్ల పొడవు గల ఈ కాలువ జలుమూరు పెద్దదూగాం--రాణ--సుబ్రహ్మణ్యపురం గ్రామాల పరిధిలో గట్టులు బలహీనంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. పలు చోట్ల మట్టి జారిపోవడం, గట్టులు కూలిపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువలో నీరు విడుదలకు ముందు గట్టులను బలపరిచి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ముందస్తుగా చర్యలు తీసుకుంటే సాగునీటి సరఫరా సక్రమంగా జరిగి పంటలకు నష్టం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులు పంపిణీ

**నరసన్నపేట, ఏప్రిల్ 23 (వార్త):** ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేటలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపు విద్యార్థులకు ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల ఆధ్వర్యంలో ఆంగ్ల నిఘంటువులు అందించారు. తమ గ్రూపులో ద్వితీయ సంవత్సరం 900 మార్కులు, ప్రథమ సంవత్సరం 400 మార్కులు పైచిలుకు సాధించిన విద్యార్థులకు అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవిలు అభినందిస్తూ వీటిని అందించారు. ప్రపంచ ఆంగ్ల సాహిత్య దినోత్సవం కావడం తమ విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులు బహుమానంగా అందించడం సంతోషంగా ఉందనీ, ప్రతీ విద్యార్థీ వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆంగ్ల అధ్యాపకులు ఆనందరావు, స్వర్ణలత కోరారు. గ్రంథాలయ అధ్యాపకులు జె.వదనగిరి పుస్తక దినోత్సవం ప్రత్యేకతలను, పుస్తక పఠనం ఆవశ్యకతను, నిఘంటువు ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగ కుమారి, సత్యనారాయణ, శివరాం ప్రసాద్, వేణుగోపాలరావు, డాక్టర్ మల్లేష్, రుప్ప సోమశేఖర్, కూన హరిప్రసాద్, సురేష్, మొదలవలస ఈశ్వరరావు పాల్గొన్నారు.




# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి




**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి డిమాండ్ చేశారు. పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం తమ సమస్యలు పరిష్కారించాలంటూ అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయం ఏఓ ప్రకాష్ కు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని, సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్స్ గా మార్చాలని, ఆయాలకు ప్రమోషన్ గైడ్ లైన్సో మార్పులు చేయాలని కోరారు. పింఛన్ తో కూడిన రిటైర్ మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, చనిపోయిన అంగన్వాడీల మట్టిఖర్చులు అమలు సరళతరం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బి సునీత, బి ఈశ్వరమ్మ, బి శ్రీదేవి, గీతాదేవి, పార్వతి, లక్ష్మి, కళ్యాణి, శ్రీదేవి, యాదవతితో అంగన్వాడీలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కడపలో ఏపీటీపీసీ స్థలంపై చర్చలు..!

### అక్కడి కలెక్టర్‌తో సమావేశమైన ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు బృందం..!.

### -కడపలో ఏపీటీపీసీ భూముల పరిశీలన --

### -అభివృద్ధి దిశగా కీలక అడుగు

**పలాస, ఏప్రిల్ 23 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) కు కడప జిల్లాలో గతంలో ప్రభుత్వం వద్ద కొనుగోలు చేసిన స్థలాన్ని కార్పొరేషన్ కి అప్పజెప్పలని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు



బృందం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా భవిష్యత్ అవసరాల దృష్ట్య ప్రణాళికలు, ఆ ప్రాంతానికి కలిగే ప్రయోజనాలపై వారు వివరించారు. ఈ స్థలం కేటాయిస్తే కడప జిల్లాలో వాణిజ్య రంగాల అభివృద్ధికి దోహదం అవుతుందని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖలతో చర్చించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి స్థలం కేటాయింపు జరిగితే, ఏపీటీపీసీ ఆధ్వర్యంలో ఆధునిక సదుపాయాలతో కూడిన ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ తో సమావేశమైన అనంతరం ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కడప జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) కు సంబంధించిన భూముల అభివృద్ధి పనులకు మరొక ముందడుగు పడింది. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో భూములను గురువారం పరిశీలించారు. గతంలో ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన సుమారు 20 ఎకరాల స్థలాన్ని ప్రత్యక్షంగా సందర్శించిన బాబూరావు, ఆ భూమి ప్రస్తుత పరిస్థితులు, భౌగోళిక స్వరూపం, రవాణా సౌకర్యాలు, అభివృద్ధి అవకాశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు అమలుకు అవసరమైన ప్రాథమిక వసతులపై కూడా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిటిపిసి చైర్మన్ మాట్లాడుతూ కడప జిల్లాలో ఏపీటీపీసీ ప్రాజెక్టు అమలు ద్వారా వాణిజ్య, రవాణా రంగాలకు పెద్ద



ఎత్తున ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ప్రాంతీయంగా పరిశ్రమల అభివృద్ధికి ఇది కేంద్రబిందువుగా మారే అవకాశం ఉందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఏర్పడతాయని పేర్కొన్నారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు భూమి హద్దులు, ల్యాండ్ రికార్డులు, అభివృద్ధికి సంబంధించిన అనుమతులపై వివరణ ఇచ్చారు. అవసరమైన అనుమతులు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. పరిశీలన సందర్భంగా ప్రదేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన బాబూరావు, సంబంధిత అధికారులకు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూమి వినియోగంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కడపలో ఈ ప్రాజెక్టు త్వరలోనే రూపుదిద్దుకుని ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఏపీటీపీసీ వైస్ చైర్మన్ & ఎండీ శేఖర్ బాబు, జనరల్ మేనేజర్ హనుమ నాయక్ ఆర్డీవో, తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546